
27న రాష్ట్రానికి ప్రధాని మోదీ



చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈ నెల 27న రాష్ట్రానికి విచ్చేయనున్నారు. గంగైకొండ చోళపురంలో జరిగే వేడుకల్లో ఆయన ముఖ్య అతిగా పాల్గొననున్నారు. ఐదు రోజులపాటు విదేశీ పర్యటన ముగించుకుని గురువారం ఆయన ఢిల్లీకి తిరిగొచ్చారు. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరున రాష్ట్రంలో పర్యటించేందుకు వస్తున్నారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ నెల 26న కేరళ రాజధాని తిరువనంతపురంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమంలో నరేంద్రమోదీ పాల్గొంటారు. అక్కడి నుంచి మరుసటి రోజు ఆయన రాష్ట్రానికి రానున్నారు. అరియలూరు జిల్లా గంగైకొండ చోళపురంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బృహదీశ్వరాలయాన్ని చోళచక్రవర్తి రాజేంద్ర చోళుడు నిర్మించారు. ఆ ఆలయంలో ఈ నెల 27న ఆషాఢ ఆరుద్ర మహోత్సవాలు నిర్వహించనున్నారు. రాజేంద్ర చోళుడి జయంతి కూడా ఆరోజే కావడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గత నాలుగేళ్లుగా ఈ వేడుకలను జరుపుతున్నారు. ఈ యేడాది జరుగనున్న ఆషాఢ ఆరుద్ర మహోత్సవాలకు ప్రధాని మోదీ రావడానికి అంగీకరించినట్లు సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. రాజేంద్ర చోళుడి జయంతి, గంగైకొండై చోళపురాన్ని నిర్మించి వెయ్యేళ్లు, దక్షిణాది దేశాలు, ఆగ్నేయ ఆసియా దేశాలపై దండెత్తి వెయ్యేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని త్రివిధ మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో గంగైకొండ చోళపురం వద్ద ప్రధాని భద్రతా విభాగం ఉన్నతాధికారులు, అరియలూరు జిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు భద్రతా ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ వేడుకల తర్వాత 28న ప్రధాని తంజావూరులో పర్యటించనున్నారు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకల్లో ప్రధాని మోదీతోపాటు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కూడా పాల్గొంటారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.



సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆలయాల జీర్ణోద్ధరణ పనులు ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ప్రాచీన ఆలయాలకు మహర్దశ

- రూ.100 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో 63 ప్రాచీన ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం శ్రీకారం చుట్టారు. సచివాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రూ.100 కోట్లతో శతాబ్దాలనాటి ప్రాచీన ఆలయాలను వాటి శిల్పకళకు భంగం వాటిల్లకుండా చేపట్టనున్న మరమ్మతు పనులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రారంభించారు. కన్నియాకు మారి జిల్లాలో పర్క్కై మధుసూదన పెరుమాళ్ ఆయలం, కాంచీపురం జిల్లా పచ్చైవన్నర్, పవళవన్నర్ ఆలయం, వేలూరు జిల్లా అన్నపూండి తిరుతాళీశ్వరర్ ఆలయం సహా 63 ఆలయాల్లో ఈ మరమ్మతు పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తామని స్టాలిన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి శాఖకు 198 వాహనాలు...

సచివాలయం వద్ద గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన మరో కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు, సబ్ కలెక్టర్లు తదితర అధికారుల కోసం రూ.17.65 కోట్లతో కొనుగోలు చేసిన 198 వాహనాలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పెరియసామి, పీకే శేఖర్‌బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

రూ.99.35 కోట్లతో పాఠశాల భవనాలు..

పాఠశాలల విద్యాశాఖ ఆధ్వర్యంలో సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ జిల్లాల్లో 72 ప్రభుత్వ మహోన్నత, ఉన్నత పాఠశాలల్లో రూ.99.35 కోట్లతో నిర్మించిన స్కూలు భవనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ఈవీ వేలు, అన్బిల్ మహేష్, పాఠశాలల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ పి. చంద్రమోహన్, రాష్ట్ర పాఠ్యపుస్తకాల సంస్థ అధ్యక్షుడు దిండుగల్ లియోని తదితరులు పాల్గొన్నారు.

ఏఐ టెక్నాలజీతో నేరస్థుల అరెస్టు

- డీజీపీ శంకర్ జివాల్



అడయార్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు బాంబు పేలుళ్ళతో పాటు పలు నేరాలతో సంబంధం ఉన్న ముగ్గురు కరడుగట్టిన నేరస్థులను వారి పాత ఫొటోలను ఉపయోగించి కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో గుర్తించి అరెస్టు చేసినట్టు డీజీపీ శంకర్ జివాల్ వెల్లడించారు. ఆయన శుక్రవారం మైలాపూర్‌లోని డీజీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు 2023లో రాష్ట్రంలో ఉగ్రవాద నిరోధక విభాగాన్ని ఏర్పాటు చేశారని, ఆ ప్రకారంగా రాష్ట్రం నుంచి 29 కేసులను ఆ విభాగానికి బదిలీ చేసినట్టు చెప్పారు. మరో 40 కేసులు విచారణ దశలో ఉన్నాయన్నారు. పాత కేసులను విచారిస్తుండగా, కొన్నేళ్ళుగా తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేశామన్నారు. ఇందుకోసం ఆపరేషన్-2ను ప్రారంభించామన్నారు. ఇందులో ఒక ఆపరేషన్‌కు 'అరమ్', మరో ఆపరేషన్‌కు 'అగళి' అనే పేర్లు పెట్టినట్టు వెల్లడించారు. కోవై నగర పోలీసులు, ఉగ్రవాద నిరోధక విభాగం కలిసి ఈ ఆపరేషన్లు చేపట్టాయన్నారు. కొన్ని కేసుల్లో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేంద్ర హోం శాఖ సహాయం తీసుకుని కొందరు నిందితులను అరెస్టు చేసినట్టు తెలిపారు. ఒక నిందితుడిని 30 యేళ్ళ తర్వాత, మరో నిందితుడిని 26 యేళ్ళ తర్వాత అరెస్టు చేశామన్నారు. వారు అబుబాకర్ సిద్ధిఖ్, అదిల్ అబుబాకర్ సిద్ధిఖ్ అని వివరించారు. మొదటి నిందితుడిపై తమిళనాడులో 5, కేరళలో రెండు కేసులున్నాయన్నారు. రెండో నిందితుడిపై 1999లో జరిగిన బాంబులు అమర్చినందుకు ఏకంగా 7 కేసులున్నాయన్నారు. ఈ ఇద్దరిని ఏపీలోని అన్నమయ్య జిల్లాలో అరెస్టు చేసినట్టు వివరించారు. మూడో నిందితుడు టైలర్ రాజాను కర్ణాటక పోలీసుల సాయంతో ఆ రాష్ట్రంలోనే అరెస్టు చేసినట్టు వెల్లడించారు. రాష్ట్ర పోలీసులు ఎంతో ప్రతిభావంతంగా పనిచేసి, ముగ్గురు భయంకరమైన తీవ్రవాదులను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరి కోసం పాత ఫోటోలకు ఏఐ టెక్నాలజీ ఉపయోగించినట్టు డీజీపీ వెల్లడించారు.

ఐఐటీలో లలిత కళలకు ప్రోత్సాహం

- డాక్టర్ పద్మ సుబ్రమణియం



విద్యార్థికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న అజిత్ ధోవల్, పద్మా సుబ్రమణియం, పవన్ గొయెంకా, వి.కామకోటి తదితరులు

అడయార్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో ఒకటైన మద్రాస్ ఐఐటీ ఎల్లవేళలా లలిత కళలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రముఖ భరతనాట్య కళాకారిణి, పద్మ విభూషణ్ డాక్టర్ పద్మ సుబ్రమణియం అన్నారు. ఐఐటీ 62వ స్నాతకోత్సవ వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్‌తో పాటు డాక్టర్ పద్మ సుబ్రమణియం, ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెస్ వి.కామకోటి, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్, ఐఐటీఎం చైర్మన్ డాక్టర్ పవన్ గొయెంకా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మ సుబ్రమణియం మాట్లాడుతూ, లలిత కళల ప్రదర్శనకు ఐఐటీఎం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఇపుడు కూడా ఇద్దరు విద్యార్థులను లలిత కళలల్లో వారి ప్రతిభను గుర్తించిందన్నారు. ఐఐటీఎంలో హ్యూమానిటీస్, లలిత కళల కోర్సులు ప్రారంభించే రోజు త్వరలో వస్తుందని తాను భావిస్తున్నానన్నారు. ఐఐటీఎం డైరెక్టర్ డాక్టర్ కామకోటి మాట్లాడుతూ, క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ 2026 ర్యాంకుల జాబితాలో ఈ విద్యా సంస్థ 227 స్థానం నుంచి 180వ స్థానానికి చేరిందన్నారు. ఇది దేశంలో తక్కువ ర్యాంకు పొందిన విద్యా సంస్థల్లో మూడోదిగా గుర్తింపుపొందిందన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో అగ్ర స్థానాన్ని నిలబెట్టుకోవడం ద్వారా ఐఐటీఎం తనను తాను నిరూపించుకుందన్నారు. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల పనితీరు ఆధారంగా వరుసగా ఆరో యేడాది నెంబర్ వన్ స్థానాన్ని దక్కించుకుందన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ప్రారంభమైనప్పటి నుంచి ఇంజనీరింగ్ సంస్థల్లో మొదటి స్థానాన్ని, పరిశోధన సంస్థల, ఆవిష్కరణల్లో రెండో స్థానాన్ని నిలుపుకుందని ఆయన గుర్తు చేశారు.

మా పార్టీ వినాశనం అసాధ్యం

- అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి



విల్లుపురం సభలో ప్రసంగిస్తున్న ఈపీఎస్

ప్యారీస్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాదరణతో రాజకీయాల్లో ముందుకు దూసుకెళ్తున్న అన్నాడీఎంకేను లేకుండా చేయడం ఎవరి తరము కాదని ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి సవాలు విసిరారు. 'మక్కలై కాప్పోం...తమిళగత్తై మీడ్పోం' అనే పేరిట రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన తొలివిడత ప్రచారంలో శుక్రవారం విల్లుపురం జిల్లాలో ఈపీఎస్ పర్యటించారు. ఈ జిల్లాలోని విల్లుపురం, విక్రవాండి, దిండివనం నియోజకవర్గాల్లో ప్రజలను కలిసి అన్నాడీఎంకేకు మద్దతివ్వాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్ షోలో ఈపీఎస్ మాట్లాడుతూ... ప్రజాదరణ కోల్పోయిన డీఎంకే ఇంటింటికీ వెళ్లి పార్టీ సభ్యులుగా చేర్చుకుంటున్న దుస్థితి అన్నాడీఎంకేకు రాలేదని, నాలుగేళ్ల డీఎంకే పాలనలో ప్రజలకు మొండిచెయ్యి చూపించడమే సాధించిన విజయమని వ్యాఖ్యానించారు. బీజేపీ దయతో అన్నాడీఎంకే ఉందని సీఎం స్టాలిన్ విమర్శిస్తున్నారని అయితే, కోట్లాది మంది కార్యకర్తలతో బలంగా ఉన్న పార్టీ కాబట్టే అన్నాడీఎంకే రాష్ట్రాన్ని సుమారు 30 ఏళ్లు పాలించి ప్రజలకు లబ్ది చేకూర్చిందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని 150 రోజులుగా పొడిగిస్తామన్న స్టాలిన్, ఆ మాట నిలబెట్టుకోలేదని, అదే విధంగా డీఎంకే పాలనకు నాలుగేళ్లు పూర్తయినా నీట్ రద్దు హామీ ఏమైందని, ఈ రకంగా ఓట్ల కోసం ఆచరణకు సాధ్యం కాని హామీలు గుప్పిస్తున్న డీఎంకేకు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గుడ్ బై చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఈపీఎస్ అభిప్రాయపడ్డారు.

స్వాతంత్ర్య సమరయోధుడు అళగుముత్తుకోన్‌కు సీఎం సహా నేతల నివాళి



ఎగ్మూరులోని వీరన్ అళగుముత్తుకోన్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తదితరులు

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వీరన్ అళగుముత్తుకోన్ 268వ జయంతి వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎగ్మూరులోని ఆయన విగ్రహం వద్ద ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తదితరులు నివాళులర్పించారు. ఎగ్మూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అళగుముత్తుకోన్ విగ్రహానికి పూలమాల వేసి, ఆయన చిత్రపటానికి స్టాలిన్ పుష్పాంజలి ఘటించారు. సీఎంతో పాటు మంత్రులు రఘుపతి, పెరియకరుప్పన్, సామినాథన్, రాజకన్నప్పన్, ఎం. సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్ ప్రియా, శాసనసభ్యులు తాయగం కవి, ఎ.వెట్రి అళగన్, జోసెఫ్ సామువేల్, ఏఎంవీ ప్రభాకర్ రాజా, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ రాష్ట్ర గిడ్డంగులు సంస్థ అధ్యక్షుడు పి. రంగనాథన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో మాజీ మంత్రులు జయకుమార్, గోకుల ఇందిరా, మాజీ ఎంపీలు చిట్లపాక్కం రాజేంద్రన్, జయవర్ధన్, పార్టీ జిల్లా శాఖ కార్యదర్శులు ఎన్.బాలగంగా, విరుగై రవి, వీఎస్ బాబు, వ్యవస్థాపక కార్యదర్శి రాయపురం మనో తదితరులు ఎగ్మూరులోని అళగుముత్తుకోన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టీఎన్‌సీసీ ఆధ్వర్యంలో

రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, ఎంపీ విజయవసంత్, ప్రధాన కార్యదర్శి ఎంఎండీఏ గోపీ, న్యాయవాది సి.ప్రకాష్‌కుమార్ అళగుముత్తుకోన్ విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఇదే విధంగా డీఎండీకే నాయకురాలు ప్రేమలత, కోశాధికారి పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే నల్లతంబి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరునాగరాజన్, మాజీ ముఖ్యమంత్రి ఒ. పన్నీర్‌సెల్వం ఆయన వర్గీయులు కూడా నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గోకుల ఇందిర తదితరులు



నివాళులర్పిస్తున్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై

నేడు గ్రూప్-4 పరీక్షలు

- ప్రైవేటు బస్సుల్లో ప్రశ్నపత్రాల తరలింపు

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌పీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం గ్రూప్-4 పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతాయి. వాటి నిర్వహణకోసం రాష్ట్రవ్యాప్తంగా 4922 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం వ్యాన్లలో పరీక్ష పత్రాలు తరలిస్తున్నప్పుడు వాటిలో డ్యూటీ చేస్తున్న పోలీసుల ద్వారా ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయి. అలాంటి సంఘటన పునరావృతం కాకుండా అధికారులు ఈ సారి ప్రైవేటు బస్సుల్లో ప్రశ్నపత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించనున్నారు. ఆయా జిల్లా కలెక్టర్ల కార్యాలయాల్లో భద్రపరచిన ఈ ప్రశ్నపత్రాలను ప్రైవేటు బస్సుల ద్వారా పరీక్ష కేంద్రాలకు శనివారం సాయంత్రం తరలించారు. మదురై జిల్లా కలెక్టర్ సబ్ ట్రెజరీలో భద్రపరచిన ప్రశ్నపత్రాలను ప్రైవేటు బస్సుల్లో ఎక్కించి అధికారులు ఆ బస్సులకు సీలు వేశారు. ప్రస్తుతం పరీక్ష కేంద్రాలకు చేరుకున్న ప్రశ్నపత్రాలు భద్రపరచిన గదుల వద్ద సాయుధ పోలీసులు కాపలా కాస్తున్నారు.



మదురై కలెక్టరేట్ నుంచి ప్రశ్నపత్రాలతో బయలుదేరుతున్న బస్సుకు సీలు వేస్తున్న దృశ్యం

నా నివాసంలో సీక్రెట్ వాయిస్ రికార్డర్

- పీఎంకే నేత రాందాస్ ఆరోపణ



ప్యారీస్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పాట్టాలిమక్కల్ కట్చి వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ తన తనయుడు అన్బుమణిపై పరోక్షంగా సంచలనాత్మకంగా ఓ ఆరోపణ చేసి కలకలం పుట్టించారు. దిండివనం తైలాపురం గార్డెన్‌లోని తన నివాసంలో లండన్ నుంచి కొనుగోలు చేసిన ఖరీదైన సీక్రెట్ వాయిస్ రికార్డర్ అమర్చారని తెలిపారు. తన కుర్చీ సమీపంలో ఉంచిన వాయిస్ రికార్డర్‌ను ఇటీవలే గుర్తించి తొలగించామని, ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. మైలాడుదురై జిల్లా శీర్గాళి సమీపంలో ఆగస్టు 10వ తేదీ వన్నియార్ల రాష్ట్ర స్థాయి మహానాడు కోసం వేదిక ఏర్పాటుపనులను శుక్రవారం తమ మద్దతుదారులతో కలసి రాందాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... తన కుమారుడు అన్బుమణి దిండివనం సమీపంలో ఉన్న తైలావరం ఇంటికి వెళ్లిన విషయం తనకు తెలియదన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందువల్ల అప్పుడే కూటమి గురించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం రాలేదన్నారు. అయితే, పీఎంకే ఉన్న కూటమి ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించి ప్రభుత్వ ఏర్పాటుచేయడం ఖాయమన్నారు. రాష్ట్రంలోని ఆలయాల నిధులు అధికంగా ఉంటే దానిని కళాశాలల కోసం వినియోగించడం తప్పు కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర విద్యా రంగానికి సంబంధించి రావాల్సిన నిధులు రాబట్టుకునేలా పీఎంకే ప్రయత్నిస్తుందన్నారు.

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా పోరూర్ పరిధిలోని పూందమల్లి మున్సిపాలిటీ, సేనీర్‌కుప్పం, కరయాన్‌చావిడి, తులసిదాస్ నగర్, చిన్న మాంగాడు, కుమరన్‌చావిడి ప్రాంతా ల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు మెట్రోవాటర్ బోర్డు గ్రీవెన్స్

పెరంబూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోవాటర్ బోర్డు గ్రీవెన్స్ శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాటర్ బోర్డు కార్యాలయాల్లో జరుగనుంది. తాగు నీరు, మురుగునీరు, కనెక్షన్లకు సంబంధించిన సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని వాటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

లా కళాశాల దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగింపు

పెరంబూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు డా.అంబేడ్కర్ లా కళాశాలల్లో అడ్మిషన్లకు సంబంధించిన దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగించారు. ఈ కళాశాలల్లో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులు అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తు స్వీకరణ జరుగుతోంది. విద్యార్థులు www.tndalu.ac.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 25వ తేది సాయంత్రం 5.45 గంటల్లోపు దరఖాస్తులు సమర్పించాలని వర్శిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

వాణిజ్య పన్ను శాఖకు రూ.11,160 కోట్లు ఆదాయం

పెరంబూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ జీఎస్టీలో జూన్ నెలలో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.11,160 కోట్లు ఆదాయం సమకూరింది. రాష్ట్ర వాణిజ్య పన్ను శాఖకు, సరుకులు, సేవల పన్నులో రాష్ట్ర వాటాగా, పెట్రోల్, డీజిల్, మద్యంపై విధించే పన్నులో వాటావస్తోంది. ఆ ప్రకారం, గత జూన్ నెలలో వాణిజ్య పన్ను శాఖకు రూ.11,160 కోట్లు ఆదాయం సమకూరింది. ఈ ఆదాయం గత ఏడాది జూన్ నెలలో రూ.11,064 కోట్లు ఉంది. గత నెల జీఎస్టీలో వచ్చిన మొత్తం ఆదాయంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.6,324 కోట్లు కాగా గత ఏడాది జూన్‌లో రూ.5,733 కోట్లుగా ఉంది. అదే నెలలో విలువ ఆధారిత పన్ను (వాట్) వసూళ్లు రూ.5,331 కోట్ల నుంచి రూ.4,836 కోట్లకు తగ్గాయి. జూన్‌లో మద్యం అమ్మకాలు తగ్గడం ఆదాయం తగ్గుదలకు కారణమని అధికారులు తెలిపారు.

చెన్నై వీఐటీలో ఎంబీఏ అడ్మిషన్ల ప్రారంభం

ప్యారీస్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై వీఐటీలో ఎంబీఏ ఫస్టియర్ అడ్మిషన్ ప్రక్రియను వీఐటీ ఛాన్సలర్ డా.కె.విశ్వనాథన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థినీ, విద్యార్థులను వీఐటీ ఉపాధ్యక్షులు జీవీ సెల్వంతో కలసి విశ్వనాథన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఛాన్సలర్ మాట్లాడుతూ... ఫ్రెంచి విప్లవం ద్వారా ప్రపంచ దేశాలకు ఫ్రాన్స్ స్వాతంత్ర్యం, సమానత్వం, సోదర భావం నేర్పించిందని, విదేశీ భాషల్లో భారతీయ విద్యార్థుల్లో ఎక్కువ మంది ఫ్రెంచి భాష నేర్చుకునేందుకు ముందుకు వస్తున్నారన్నారు. పట్టభద్రులు మరికొందరికి ఉపాధి కల్పించేలా ఎదగాలని, అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని నూతన పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. కాగా, వీఐటీ చెన్నై నాన్ ఇంజనీరింగ్ కోర్సుల కౌన్సెలింగ్ ఈ నెల 14 నుంచి 17వ తేది వరకు జరుగుతుందని ఆయన తెలియజేశారు.

గిండి చిల్డ్రన్స్ పార్క్‌లో సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం

పెరంబూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గాయపడి తీరానికి కొట్టుకొచ్చే సముద్ర తాబేళ్లను సంక్షరించేలా రూ.14.50 కోట్లతో, గిండి చిల్డ్రన్స్ పార్క్‌లో సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం ఏర్పాటుకానుంది. ఎన్నూర్ నుంచి కోవలం వరకు సముద్రంలో పడవలు, నౌకలు, వలల్లో చిక్కుకుని గాయపడి, మృతిచెందిన తాబేళ్లు తీరానికి కొట్టుకొస్తున్న ఘటనలు అధికమవుతున్నాయి. స్వచ్ఛంద సంస్థల సహకారంతో గాయపడిన తాబేళ్లకు చికిత్స అందించడం, మృతిచెందిన తాబేళ్ల కళేబరాలు తీరంలో పూడ్చిపెట్టడం తదితరాలను అటవీ శాఖ చేపడుతోంది. కానీ, సముద్ర తాబేళ్ల సంరక్షణకు ఎలాంటి సదుపాయం లేకపోయింది. ఈ నేపథ్యంలో, గిండి చిల్డ్రన్స్ పార్క్‌లో రూ.14.50 కోట్లతో సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం ఏర్పాటుకానుంది. గాయపడిన తాబేళ్లను ఈ కేంద్రానికి తరలించి చికిత్స అందించిన అనంతరం మళ్లీ సముద్రంలో విడిచిపెట్టనున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

రేపు మాస్ ఆధ్వర్యంలో 'ప్రతిభా పురస్కారాలు'

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 'మద్రాస్ ఆది ఆంధ్ర అరుంధతీయ ఆదివాసి సంక్షేమ సంఘం (మాస్) ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు, ప్రతిభావంతులైన 10, 12 తరగతుల విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం జరుగనుంది. పెరంబూరులోని డీఆర్‌బీసీసీసీ స్కూల్లో సాయంత్రం జరిగే ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని మాస్ అధ్యక్షులు డాక్టర్ కొల్లి రాజు, ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి అజరత్తయ్య, కోశాధికారి ఎం.వీరయ్య విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం పొందిన జనని వ్యవస్థాపకులు, మాస్ సలహాదారు గుడిమెట్ల చెన్నయ్యను నిర్వాహకులు సత్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌కంట్యాక్స్ అడిషనల్ కమిషనర్ ఎం.మోహన్‌బాబు, గౌరవ అతిథులుగా తమిళనాడు ప్రభుత్వ సోషల్ జస్టిస్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎ.జైసన్, రాష్ట్ర ప్రభుత్వ న్యాయశాఖ అదనపు కార్యదర్శి జీసీ నాగూర్, టామ్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గొల్లపల్లి ఇశ్రాయేలు హాజరుకానున్నారు.


కుట్రాలం జలపాతాల్లో పర్యాటకుల రద్దీ

ప్యారీస్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా పశ్చిమ కనుమల సమీపంలో ఉన్న కుట్రాలంలో ప్రస్తుతం సీజన్ ప్రారంభం కావడంతో, అక్కడున్న ఐదు జలపాతాల వద్ద పర్యాటకుల రద్దీ పెరిగింది. వారం రోజుల క్రితం వర్షాలు కురవడంతో కుట్రాలం జలపాతాల్లో నీటి ప్రవాహం కాస్త ఉన్నప్పటికీ, స్థానికులు, పొరుగు ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులను స్నానాలకు అనుమతించారు.

15 నుంచి పళని రోప్‌కార్ సేవలు రద్దు

ప్యారీస్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళనిలో కొండపై వెలసిన దండాయుధపాణి ఆలయానికి భక్తులు వెళ్లేందుకు వీలుగా అందుబాటులో ఉన్న రోప్‌కార్ సేవలు మరమ్మతుల కారణంగా ఈ నెల 11 నుంచి నెల రోజులు నిలిపివేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. పళని క్షేత్రంలో ఇప్పటికే వించ్ రైలు సేవలు కొనసాగుతున్న నేపథ్యంలో, భక్తుల సౌకర్యార్థం కొండపై ఉన్న ఆలయానికి సులువుగా వెళ్లేందుకు రోప్‌కార్ సేవలు కూడా ప్రారంభించారు. కాగా, భక్తుల భద్రత దృష్ట్యా ప్రతి ఏడాది రోప్‌కార్‌కు మరమ్మతులు చేపడుతుంటారు. ఆ ప్రకారం, ఈ నెల 15 నుంచి 31 రోజులు మరమ్మతులు చేపట్టనున్న కారణంగా, ఆలయానికి వెళ్లే భక్తులు వించ్, మెట్ల మార్గంలో వెళ్లాలని ఆలయ నిర్వాహకులు సూచించారు.

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో వెలికితీసిన
వందేళ్లనాటి అమ్మవారి గర్భాలయం



అమ్మవారి గర్భాలయ గోపురం - బయపడిన గర్భాలయం - ఆలయంలో విగ్రహాలు

టి.నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి దగ్గర మణప్పారై సమీపంలోని విటత్తిలాంపట్టి వద్ద వందేళ్ల క్రితం భూమిలో కూరుకుపోయిన ప్రాచీన కాలం నాటి అమ్మవారి ఆలయాన్ని వెలికితీసే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అధికారులు ఈ పనులను చేపడుతున్నారు. మాముండి వాగు షట్టర్ ప్రాంతం వద్ద పట్టత్తరసి అమ్మన్ ఆలయం ఉండేది.ఆ ఆలయం వందేళ్లకు ముందు ఆ వాగులో వరదల కారణం భూమిలో కూరుకుపోయింది.ఆ ఆలయ గోపుర విమాన భాగం మాత్రమే కనిపిస్తుండేది. ఈ నేపథ్యంలో ఆ ఆలయాన్ని వెలికి తీసేపనులను హిందూ దేవాదాయ శాఖ రూ.2లక్షలు కేటాయించింది. దీంతో నెల రోజులుగా యంత్రాల సహాయంతో తవ్వకాలు జరిపి ఆ ఆలయాన్ని చెక్కుచెదరకుండా వెలికి తీసేందుకు పనులు జరిగాయి. ప్రస్తుతం ఆ ఆలయ గర్భాలయ ప్రాంతం పూర్తిగా వెలికి తీశారు. ఆ గర్భాలయంలో కాల్చినమట్టితో తయారైన మూల వర్ల రూపాలు, త్రిశూలం ఉన్నాయి. ప్రస్తుతం దేవాదాయ శాఖ పరిశోధకులు వినోద్‌కుమార్, ఆలయ ట్రస్టీ మల్లగౌండర్, ఊరి పెద్దలు, స్థానిక కార్మికులు ఆ ఆలయ ప్రహరీ తదితర నిర్మాణాలను వెలికి తీసే పనులను చేపడుతున్నారు.

చట్టసభల్లో ప్రాధాన్యం ఇవ్వాల్సిందే

● స్వతంత్ర నగర్ సభలో తెలుగు నేతల డిమాండ్



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కార్యవర్గం

ప్యారీస్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో తమకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిందేనని తెలుగు నేతలు డిమాండ్ చేశారు. ట్రిప్లికేన్ ప్రాంతంలో ఆదిఆంధ్రులు అధికంగా నివసిస్తున్న స్వతంత్ర నగర్ ఆదిఆంధ్ర ప్రజా సంక్షేమ సంఘం నూతన కమిటీ నిర్వాహకుల ఎన్నికలు జూన్ 29న మద్రాసు హైకోర్టు న్యాయవాదులు ఎస్.బాలాజి, ఎస్.హరినారాయణ, గ్రామ పెద్ద ఏటీ వెంకటేశు పర్యవేక్షణలో బ్యాలెట్ విధానంలో నిర్వహించారు. అందులో, మొండెం కృష్ణమూర్తి (ప్రెసిడెంట్), ఉద్దాల హరి (కార్యదర్శి), కాకి శ్రీనివాసన్ (కోశాధికారి), టీఎల్ వెంకటయ్య అలియాస్ అబ్దుల్ (వైస్ ప్రెసిడెంట్), కప్పల విష్ణుప్రసాద్ (డిప్యూటీ సెక్రటరీ) గెలిచారు. గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వీరిచేత ఎన్నికల నిర్వాహకులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆత్మీయ అతిథులుగా టామ్స్ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేలు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కర్రా లోకేష్‌కుమార్, తమిళనాడు ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులు సెల్వకుమార్‌తో పాటు ఆదిఆంధ్ర అరుంధతీయ సంఘాల నాయకులు, స్వతంత్ర నగర్ గ్రామస్తులు హాజరై, నూతన కార్యవర్గ కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గొల్లపల్లి ఇశ్రాయేలు మాట్లాడుతూ... రాష్ట్ర జనాభాలో తెలుగు మాతృభాష కలిగిన ప్రజలకు ఓటు హక్కు ఉందని అయినా, పాలకులు మాత్రం తెలుగు వారికి లబ్ధిచేకూర్చడం లేదన్నారు. రాజధాని నగరంలో ఉన్న సుమారు 132 గ్రామాల్లో దాదాపు 7 లక్షల మందికి పైగా ఆదిఆంధ్రులున్నారని, ఐక్యతతో ముందుకొచ్చి బలాన్ని నిరూపించుకోవాలని ప్రభుత్వాల నుంచి హక్కులు సాధించుకునేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

14న నియామక ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

పుదుచ్చేరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి బీజేపీకి చెందిన ముగ్గురు నియామక ఎమ్మెల్యేలు ఈ నెల 14న ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు రాజ్ నివాస్ ఒక ప్రకటనలో తెలిపింది. సీఎం ఎన్.రంగస్వామి నేతృత్వంలో ఎన్నార్ కాంగ్రెస్-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగుతోంది. మరో పది నెలల్లో పదవీకాలం పూర్తికానున్న నేపథ్యంలో, 2026 అసెంబ్లీ ఎన్నికలకు పుదుచ్చేరిలోని రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమిలో డీఎంకే, సీపీఎం, సీపీఐ తదితర పార్టీలు ఎన్నికల ప్రచారం కూడా చేపట్టాయి. అదే విధంగా, ఎన్నార్ కాంగ్రెస్ కూడా నియోజకవర్గాల వారీగా ఎన్నికల ఇన్‌ఛార్జీలను నియమించింది. మరోవైపు బీజేపీ మళ్లీ అధికారంలో కొనసాగేలా పార్టీ పరంగా మార్పులు చేపట్టింది. రెండు వారాల క్రితం బీజేపీ మంత్రి సాయిశరవణ కుమార్ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో కొత్త మంత్రిగా జాన్‌కుమార్ నియమితులయ్యారు. బీజేపీ ఎమ్మెల్యేలు వీపీ రామలింగం, వెంకటేశన్, అశోక్ బాబు కూడా ఆ పదవులకు రాజీనామా చేశారు. వీరి స్థానంలో కొత్త ఎమ్మెల్యేలుగా తీపాయన్‌దాన్, సెల్వం, కారైక్కాల్ రాజశేఖరన్‌లను నియమించినట్లు సీఎం రంగస్వామి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాస్‌నాథ్‌కు ప్రతిపాదించారు. గవర్నర్ దీనిని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అనుమతి కోసం పంపించారు. దీనికి అంగీకారం రావడంతో ఈ నెల 14న పుదుచ్చేరి అసెంబ్లీలో నియామక ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

'దున్నపోతా' అని తిడితే చూస్తూ ఊరుకోం!

● పశువుల మహానాడులో సీమాన్ ఆగ్రహం



మహానాడులో ప్రసంగిస్తున్న సీమాన్ - మహానాడుకు తరలించిన పశువులు

టి.నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎవరినైనా 'దున్నపోతా' అని తిడితే చూస్తూ ఊరుకోమని నామ్‌తమిళర్ కట్చి నేత సీమాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మదురై సమీపం వీరాదనూరులో గురువారం రాత్రి పార్టీ వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటైన పశువులు, మేకల మహానాడులో ఆయన ప్రసంగించారు. ఈ మహానాడులో ఓ వైపు పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మరో వైపు సుమారు రెండు వందలకు పైగా పశువులు, మేకలను కంచెలో నిలిబెట్టారు. పశువులకు మేయడానికి ప్రతి ఊరిలోనూ ప్రత్యేక స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతూ, పశువులను మేతకు తీసుకెళ్లే వారిపై అటవీ శాఖ సిబ్బంది దాడులను ఖండిస్తూ సీమాన్ ఈ మహానాడు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీమాన్ ప్రసంగిస్తూ పశువులు, మేకలను మేపేందుకు అవమానంగా భావించకూడదని, అదృష్టంగా భావించాలన్నారు. పశువులకు ప్రత్యేకంగా పండుగ జరుపుతున్న సంస్కృతి మనది అని, ఇకపై ఎవరూ ఎవరినీ దున్నపోతా అని తిట్టకూడదని, అలా తిడితే తాను చూస్తూ ఊరుకోనని చెప్పారు. తేని జిల్లాలో పశువులను అటవీ ప్రాంతంలో మేపడానికి తీసుకెళ్ళిన రైతుపై అటవీ శాఖ అధికారులు జరిపిన దాడిని ఖండిస్తూ ఆగస్టు 3న ఆ ప్రాంతంలోనే వేల సంఖ్యలో పశువులను, మేకలను మేతకు తీసుకెళ్లే ఆందోళన జరుపనున్నట్లు సీమాన్ ప్రకటించారు.

ఆరోగ్య సంరక్షణకు ధ్యానం అవసరం



ధ్యానంపై సూచనలు, సలహాలు అందిస్తున్న నిర్వాహకులు

తిరుత్తణి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణ ధ్యానం అవసరమని పలువురు వక్తలు సూచించారు. గురు పౌర్ణమిని పురస్కరించుకుని తిరువళ్లూర్ జిల్లా పల్లిపట్టు మండలం సామంతవాడ గ్రామంలో బాలయోగేశ్వర మార్బుల్ పిరమిడ్ ధ్యాన మందిర్ ఆధ్వర్యంలో, ప్రజలకు ధ్యానం ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుత్తూర్ జ్ఞాన మందిర్ మాస్టర్ రవి పాల్గొని, ప్రజలకు ధ్యానంపై ఉన్న సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో బాలయోగేశ్వర మార్బుల్ పిరమిడ్ మాస్టర్స్ శ్రీదేవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి సీఎం రాజీనామా చేస్తే జైల్లో ఉంటారు...!

● మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి

పుదుచ్చేరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి సీఎం పదవికి రంగస్వామి రాజీనామా చేస్తే ఆయన జైలుకెళతారని మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి జోస్యం చెప్పారు. శుక్రవారం తన నివాసంలో నారాయణస్వామి మీడియాతో మాట్లాడుతూ... ఆరోగ్య శాఖ డైరెక్టర్‌గా సెవ్వేలును గవర్నర్ నిబంధనల ప్రకారమే నియమించారని అయితే, దీనిని వ్యతిరేకిస్తూ రంగస్వామి గవర్నర్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఆరోగ్య శాఖ డైరెక్టర్ పదవి భర్తీచేసేందుకు సీఎం కార్యాలయ సిబ్బంది రూ.50 లక్షలు డిమాండ్ చేశారని, ఈ ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన రంగస్వామి, తన పదవికి రాజీనామా చేస్తారని లెఫ్టినెంట్ గవర్నర్‌ను బెదిరించే ధోరణిలో వ్యవహరిస్తున్నారని, ఒకవేళ ఆయన రాజీనామా చేస్తే జైలుకెళ్తారన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-ఎన్నార్ కాంగ్రెస్ కూటమి చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నారాయణస్వామి తెలిపారు.

ఈపీఎస్ హయాంలో అన్ని ఎన్నికల్లో అపజయాలే...!

● కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం

ప్యారీస్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎడప్పాడి పళనిస్వామి సీఎం అయిన తర్వాత అన్ని ఎన్నికల్లో అన్నాడీఎంకేను గెలిపించలేకపోయారని శివగంగ కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం పేర్కొన్నారు. కారైకుడిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో హిందీ నిర్బంధం చేయాలనుకున్న బీజేపీ ప్రయత్నాలు ఫలించబోవని, 2026 ఎన్నికల్లో ఎన్ని కూటములున్నా, ఇండియా కూటమి ఘనవిజయం సాధిస్తుందన్నారు. పళనిస్వామి ఎన్నికల్లో పోటీచేసి ముఖ్యమంత్రి పదవికి రాలేదని, పలు కారణాల వల్ల ఆయన సీఎం అయిన తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లో పార్టీ చిత్తుగా ఓడిపోయిందన్నారు. కొడనాడుతో పాటు పలు కేసులకు సంబంధించిన విచారణ త్వరితగతిన పూర్తిచేసి నిందితులను కోర్టులో హాజరుపరచి శిక్ష పడేలా చేయాల్సిన బాధ్యత పోలీసు శాఖదేనని కార్తీ చిదంబరం తెలిపారు.

నాగై ఆర్టీవో ఆఫీసులో రూ.1.5 లక్షల స్వాధీనం

అడయార్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం ప్రాంతీయ రవాణా కార్యాలయం (ఆర్టీవో)లో విజిలెన్స్ అధికారులు జరిపిన ఆకస్మిక తనిఖీల్లో రూ.1.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యాలయంలో మురుగానందం అనే ఉద్యోగి భారీ మొత్తంలో లంచాలు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం అవినీతి నిరోధక శాఖ (విజిలెన్స్) అధికారులకు తెలియడంతో వారు శుక్రవారం తనిఖీలు జరిపి రూ.1,59,500 స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి మురుగానందంను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

సీఎంసీ డైరెక్టర్‌కు ఉద్యోగుల కృతజ్ఞతలు



సీఎంసీ డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఉద్యోగులు

వేలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఎంసీ ఆసుపత్రి ఉద్యోగులకు ఇళ్ల పట్టాలు కేటాయించారు. ఆస్పత్రి చేపడుతున్న ప్రజా సేవలో భాగంగా ఆసుపత్రిలో పనిచేస్తున్న నాలుగో స్థాయి ఉద్యోగులు 200 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. దీంతో, టీఎస్ సుధాకర్ నేతృత్వంలో ఉద్యోగులు శుక్రవారం సీఎంసీ డైరెక్టర్ డా.విక్రమ్ మోహదీవ్‌ను కలుసుకుని శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు.

డీఎంకేకు పెరుగుతున్న ప్రజాదరణ

● మంత్రి దురైమురుగన్



మంత్రికి వెండి గద అందజేస్తున్న పార్టీ నిర్వాహకులు

వేలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ప్రజాదరణ పెరిగిందని నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ తెలిపారు. డీఎంకే పథకాలు ప్రజలకు వివరించేలా కేవీ కుప్పం బస్టాండ్‌లో గురువారం రాత్రి బహిరంగ సభ నిర్వహించారు. సభలో చేనేత శాఖ మంత్రి గాంధీ, అరక్కోణం ఎంపీ జగద్రక్షకన్, అనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే దయ వల్లే ఎండీఎంకేకు ఈసీ గుర్తింపు

● మాజీ మంత్రి జయకుమార్

ప్యారీస్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే దయ వల్లే ఎండీఎంకేకు ఈసీ నుంచి గుర్తింపు వచ్చిందన్న వాస్తవాన్ని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో మరచిపోకూడదని మాజీ మంత్రి డి.జయకుమార్ తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు అళగు ముత్తుకోన్ జయంతి సందర్భంగా ఎగ్మూర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి శుక్రవారం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో జయకుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వంలో శాంతి భద్రతలు క్షీణించాయని విమర్శించారు. ఎండీఎంకే నేత వైగో చేసిన మేలు మరచిపోవడం సరికాదని, డీఎంకే కూటమి నుంచి వైదొలిగిన సమయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి సీట్లు కేటాయించి గెలిపించారని, అందువల్లే కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపు వచ్చిందన్నారు. అయితే ప్రస్తుతం డీఎంకే కూటమిలో ఉన్నందున ఆ పార్టీ పెద్దల మెప్పు పొందాలన్న ఉద్ధేశంతోనే అన్నాడీఎంకేను వైగో విమర్శిస్తున్నారని, దీనిని తాము పట్టించుకోబోమని జయకుమార్ తెలిపారు.

750 గ్రాముల గంజాయితో ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేట సమీపంలోని సెవెన్‌హిల్స్ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులు, 750 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో నిషేధించిన మాదకద్రవ్యాల విక్రయాలు అడ్డుకునేలా పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. వారికి అందిన సమాచారంతో గురువారం సెవెన్ హిల్స్ ప్రాంతంలో స్థానిక పోలీసులతో కలసి తనిఖీలు నిర్వహించారు. పెరియన్న వీధిలో అనుమానాస్పదంగా నిలబడిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు గంజాయి వ్యాపారులు అని తెలిసింది. దీంతో వారి నుంచి 750 గ్రాముల ఓజీ రకానికి చెందిన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... వారు తండయార్‌పేటకు చెందిన శ్రీప్రేమ్ కుమార్ (32), వింకో నగర్‌కు చెందిన రాజన్ (36), బ్రాడ్‌వేకు చెందిన అలెక్స్ (34) అని తెలిసింది. వీరిలో శ్రీ ప్రేమ్‌కుమార్ సినీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ ముగ్గురిని కోర్టు ఉత్తర్వులు మేరకు పుళల్ జైలుకు తరలించారు.

రూ.కోటి విలువైన గంజాయి దహనం



యంత్రాల్లో గంజాయి వేస్తున్న పోలీసులు

ప్యారీస్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ నగరంలోని పోలీస్ స్టేషన్లలో స్వాధీనం చేసుకున్న రూ. కోటి విలువైన 337 కిలోల గంజాయిని కోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసులు శుక్రవారం దహనం చేశారు. 2019 నుంచి నమోదు చేసిన 135 గంజాయి కేసులకు సంబంధించిన విచారణ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో, మద్రాసు హైకోర్టు ఆదేశాల మేరకు కోవై మధుకరై చెట్టిపాళయంలో ఉన్న కర్మాగారంలోని యంత్రాల్లో గంజాయి బండిళ్లు వేసి దహనం చేశారు. కోవై నగర పోలీస్ కమిషనర్ రాజేంద్రన్, మేజిస్ట్రేట్లు సెంథిల్‌రాజా, లోకనాధన్, కోవై ఫోరెన్సిక్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ పర్యవేక్షించారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



సుజి (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటూ చదువుకునేందుకు తల్లిదండ్రులు అనుమతించకపోవడంతో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పల్లిపట్టు సమీపంలో చోటుచేసుకుంది. జేమ్స్ పల్లిపట్టు సమీపంలోని కొలత్తూర్ గ్రామానికి చెందిన సుజి (18) చెన్నైలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీ.కాం మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె ప్రతిరోజు బస్సులో కళాశాలకు వెళుతోంది. బస్సులో ప్రయాణించడం ఇబ్బందికరంగా ఉందని, తాను కళాశాల హాస్టల్ ఉంటూ చదువుకుంటానని విద్యార్థిని తల్లిదండ్రులకు తెలిపింది. అందుకు వారు నిరాకరించడంతో కొద్దిరోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తల్లిదండ్రులు ఆమెను తిరువళ్లూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక గురువారం మృతిచెందింది.

బాల కార్మికులచే చెట్ల తొలగింపు



చెట్ల తొలగింపులో బాల కార్మికులు

తిరుత్తణి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికులచే చెట్ల తొలగింపు పనులు చేయించడాన్ని పలువురు సమాజ సేవకులు అభ్యంతరం తెలుపుతున్నారు. తిరువళ్లూర్ జిల్లాలో రోడ్ల విస్తరణలో భాగంగా పలు చెట్లు తొలగిస్తున్నారు. అదే సమంలో, తొలగించిన చెట్లకు బదులు మొక్కలు నాటాలని హైకోర్టు సూచించింది. ఈ నేపథ్యంలో, చెట్ల తొలగింపులో బాల కార్మికులు పాల్గొనడంపై సమాజ సేవకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

బధిరుల సమస్యలు పరిష్కరించాలి



దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న పళనిస్వామి, నిర్వాహకులు

వేలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బధిరుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర బధిరుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం సంఘ నిర్వాహకులు పళనిస్వామి, సికిందర్ రాబర్ట్, జయశంకర్, కార్తికేయన్, దేన్‌సింగ్, మణివాసుకి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి మధుమతికి వినతిపత్రం సమర్పించారు.

తెలంగాణా నుంచి యూరియా దిగుమతి

వేలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా రాష్ట్రం నుంచి కాట్పాడికి 1598 టన్నుల యూరియా దిగుమతి చేసుకున్నారు. ఈ యూరియాను వేలూరు జిల్లాకు 201 టన్నులు, రాణిపేట జిల్లాకు 161 టన్నులు, తిరుపత్తూర్ జిల్లాకు 50 టన్నులు, తిరువళ్లూర్ జిల్లాకు 25 టన్నులు, తిరువణ్ణామలై జిల్లాకు 693 టన్నులు, కాంచీపురం జిల్లాకు 378 టన్నులను లారీల ద్వారా పంపించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.



యూరియా బస్తాలు లారీలోకి ఎక్కిస్తున్న కూలీలు

మీనచ్చల్ ఆలయంలో మూలికల పొడులతో వర్ణచిత్రాలు


ఆలయంలో కళాకారులు వేసిన కాళికాంబాళ్ చిత్రం

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి - కేరళ సరిహద్దులోని మీనచ్చల్ గ్రామంలోని భద్రకాళి ఆలయంలో యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న మూలికల ఆకుల పొడులతో తయారైన రంగులతో కళాకారులు వేసిన 'కళమెళుత్తు పాట్టు' చిత్రాలను చూడటానికి భక్తులు బారులు తీరారు. కళమెళుతున్న పాట్టు అనేది కేరళలో ఒక సాంప్రదాయ ఆరాధన కళారూపం. మూలికా ఆకుల నుండి తీసిన రంగుల పొడులతో దేవతామూర్తుల చిత్రాలను నేలపై చిత్రీకరించి, పాటలుపాడుతూ నృత్యం చేస్తూ పూజిస్తారు. ఈ పూజలను భద్రకాళి, అయ్యప్ప, వేట్టకొరుమగన్ వంటి దేవతామూర్తులకు నిర్వహించడం ఆనవాయితీ. గతంలో ఇలాంటి ఆరాధనలను పాటించే వారు, ఈ రకం చిత్రలేఖనాలను రూపొందించే కళాకారుల సంఖ్య తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో మలయాళీలు అధికంగా నివసించే కన్నియాకుమారి జిల్లాలోని కేరళ సరిహద్దు ప్రాంతమైన మీనచ్చల్ గ్రామంలో మేలేవీడు భద్రకాళి ఆలయంలో రెండు రోజులుగా కళమెళుతున్న పాట్టు చిత్రాలను నేలపై చిత్రీకరించి అమ్మవారిని భక్తులు ఆరాధిస్తున్నారు.

ప్రజల కష్టాలు తీరాలంటే ఎడప్పాడిని సీఎంగా గెలిపించాలి

● అన్నాడీఎంకే ప్రచార విభాగం డిప్యూటీ కార్యదర్శి, గౌతమి


భగవతి అమ్మన్ దర్శనం చేసుకుంటున్న సినీ నటి గౌతమి

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా ప్రజలు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారని, వారి కష్టాలు తొలగాలంటే ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)ను ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఆ పార్టీప్రచార విభాగ డిప్యూటీ కార్యదర్శి, ప్రముఖ సినీనటి గౌతమి అన్నారు. శుక్రవారం ఉదయం ఆమె కన్నియాకుమారిలో భగవతి అమ్మన్ ఆలయాన్ని పార్టీ స్థానిక నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఆ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. వీటన్నింటికీ పరిష్కార మార్గం ముఖ్యమంత్రిగా మళ్ళీ ఈపీఎస్ గెలిచి తీరాలని అన్నారు. గౌతమి వెంట అన్నాడీఎంకే నేత, ఎమ్మెల్యే దళవాయ్ సుందరం తదితరులు పాల్గొన్నారు.

హొరూర్‌లో వీకేసీ షోరూం


షోరూం ప్రారంభోత్సవ దృశ్యం

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వీకేసీ సంస్థ హొరూర్‌లో నూతన షోరూం ఏర్పాటు చేసింది. సంస్థ డైరెక్టర్లు ప్రేమ్‌రాజ్, సుబాష్‌తో కలిసి స్టోర్ యజమాని అంజన్ శుక్రవారం ఈ షోరూం లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ వీకేసీ రజాక్ మాట్లాడుతూ.. వీకేసీ స్టోర్లు దేశంలోని టైర్2, టైర్ 3 పట్టణాల ఫుట్‌వేర్ అవసరాలను తీర్చడానికి ప్రత్యేకంగా రూపొందించబడ్డాయని తెలిపారు. తమిళనాడులో ఇది తమ 23వ షోరూం అని, ప్రతి కొత్త అవుట్‌లెట్‌తో, దేశంలోని ప్రతి మూలకు సమకాలీన ఫ్యాషన్ తీసుకెళ్లాలనే తమ కలను చేరుకోవడానికి కృషి చేస్తున్నామని వివరించారు.

సీఎంతో సయ్యదనా ముఫద్దల్ సైఫుద్దీన్ భేటీ



చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా వున్న దావూదీ బోహ్రా ముస్లిం సమాజ 53వ నాయకుడు సయ్యదనా ముఫద్దల్ సైఫుద్దీన్ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో భేటీ అయ్యారు. ఇటీవల చెన్నైలో జరిగిన ముబారకా సభలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు ముఫద్దల్ సైఫుద్దీన్ నగరానికి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆళ్వారుపేటలోని సీఎం నివాసానికి వెళ్లిన సైఫుద్దీన్.. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన వారికి సదుపాయాలు కల్పించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. తమిళనాడు, చెన్నై ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థన జరిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు కూడా పాల్గొన్నారు.

ముగిసిన 'ఎబిలిటీ ఫెస్ట్'


విజేతలకు బహుమతి ప్రదానం

చెన్నై, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 'ఎబిలిటీ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ప్రీమియర్ ఇంటర్నేషనల్ డిజబిలిటీ ఫిల్మ్ ఫెస్టివల్ 'ఎబిలిటీ ఫెస్ట్ 2025' గురువారం రాత్రి చెన్నైలో ముగిసింది. 'సితారే జమీన్ పర్' చిత్ర బృందం వేదికపైకి రాగానే వాతావరణం ఉత్సాహంగా మారిపోయింది. దర్శకుడు ఆర్ఎస్ ప్రసన్న, రచయిత ఇవి నిధి శర్మ, సహ నిర్మాత అపర్ణ పురోహిత్, చిత్రం బాస్కెట్ బాల్ జట్టులోని నటులు కూడా వేదికపైకి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎబిలిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జయశ్రీ రవీంద్రన్, నటి, దర్శకురాలు రేవతి పోటీల్లో పాల్గొన్న వారందరినీ అభినందించారు. కేవలం 60 సెకన్లలో ఆకర్షణీయమైన కథ చెప్పడంలో వున్న సృజనాత్మకత సవాళ్లను వివరించారు.. విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో పాటు రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు అందించారు.

జాలరికి పట్టిన అదృష్టం

● వలలో చిక్కిన 5 టన్నుల చేపలు


పార్రై చేపలు

టి.నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నాటు పడవలో వేటకు వెళ్ళి వారం రోజులపాటు ఖర్చులకు సరిపోయేంత చేపలు పట్టుకొద్దామని వెళ్ళిన జాలరికి ఊహించని అదృష్టం వరించింది. ఆ జాలరి విసిరిన వలలో టన్నుల కొద్ది 'పార్రై చేపలు' చిక్కాయి. దీంతో అప్పటి దాకా అతడి ఇంటిలో తిష్టవేసిన దరిద్రదేవత పారిపోయింది. రామనాథపురం జిల్లా తిరువట్టానై సమీపంలోని తొండి - పుదుకుడి గ్రామానికి చెందిన కన్నన్ అనే జాలరి రెండు రోజుల క్రితం నాటుపడవలో సముద్రంలో చేపలు పట్టేందుకు వెళ్ళాడు. తీరం నుండి నాలుగైదు నాటికల్ మైళ్ల దూరంలో కన్నన్ వలను విసిరి, వచేచి చూడగా చేపల భారంతో నాటుపడవ కాస్త ఊగసాగింది. వలలో చేపలు పడటంతో పడవ ఊగుతున్నట్టు గ్రహించి అతడికి సమీపంలో చేపలు పడుతున్న జాలర్ల సాయం తీసుకున్నాడు. వెంటనే ఆ జాలర్లు అందరూ కలిసి వలను బయటకు లాగినప్పుడు వలలో టన్నుల కొద్దీ 'పార్రై చేపలు' ఉండటం చూసి విస్తుపోయారు. సాధారణంగా ఈ రకం చేపలు నాటు పడవ వలలో పడటం అరుదు. మూడు నాటు పడవల సాయంతో ఆ చేపలను తీరానికి చేర్చి తూకం వేయగా, 5 టన్నులున్నాయి.. మార్కెట్‌లో టన్ను పార్రై చేపలు రూ. 3లక్షలకు విక్రయిస్తున్నారు. కన్నన్ వలలో 5 టన్నుల చేపల పడటంతో వాటిని రూ.15లక్షల దాకా వేలం పాట ద్వారా అమ్మటానికి ప్రయత్నిస్తున్నారు. ఉన్నట్టుండి పార్రై చేపల రూపంలో జాలరి కన్నన్‌కు పట్టిన అదృష్టానికి స్థానిక జాలర్లంతా అతడిని అభినందించారు.

చిత్రజ్యోతి


కుమార్తె జోవికతో వనిత విజయకుమార్

భవిష్యత్‌లో మరో విజయ్ అవుతాడు

● వనిత విజయకుమార్

ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి కుమారుడు సూర్య విజయ్ భవిష్యత్‌లో మరో విజయ్ అవుతాడని ప్రముఖ నటి వనిత విజయకుమార్ జోస్యం చెప్పారు. ఆమె ప్రధాన పాత్రలో 'మిసెస్ అండ్ మిస్టర్ చిత్రాన్ని తెరకెక్కించారు. వనిత కుమార్తె జోవిక నిర్మాత. శుక్రవారం సినిమా విడుదలైంది. మూవీ ప్రమోషన్‌లో భాగంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, 'విజయ్ సేతుపతి కుమారుడు సూర్య నటించిన 'ఫీనిక్స్' సినిమాపై తీవ్రస్థాయిలో ట్రోల్స్, విమర్శలు వస్తున్నాయి. అనేక మంది సూర్యను హేళనగా మాట్లాడుతున్నారు. 'నాళైయ తీర్పు' సినిమాలో విజయ్‌కు కూడా ఇలానే జరిగింది. వాటన్నింటిని విజయ్ అధిగమించి దళపతిగా నిలిచారు. ఇపుడు సూర్య విజయ్ కూడా భవిష్యత్‌లో మరో విజయ్ అవుతాడు. నిర్మాతగా నా కుమార్తె కూడా సక్సెస్ సాధిస్తుంది. కెరీర్ ఆరంభంలో నయనతార, త్రిషలకు కూడా ఇదేపరిస్థితి ఎదురైంది. కాగా నా చిత్రం విడుదలకు ముందు ఒకే టెన్షన్. ఈ మూవీలో అడల్ట్ కంటెంట్ అధికంగా ఉన్నట్టు చెబుతున్నారు. స్క్రిప్టు అలాంటిది. నేటి తరానికి ఖచ్చితంగా నచ్చుతుంది' అన్నారు.

అప్పట్లో డబ్బు విలువ తెలియలేదు

● శశికుమార్



నాలుగు దశాబ్దాలుగా డబ్బు విలువ తెలియలేదని ప్రముఖ నటుడు శశికుమార్ అన్నారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'ఫ్రీడమ్' ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ, 'మణిరత్నం దర్శకత్వంలో రజనీ నటించిన 'దళపతి' చిత్రంలోని ఓ సన్నివేశంలో రక్తదానం చేశాక డబ్బులు ఇవ్వబోతుంటే ధన్యవాదాలు చెబుతారు. అపుడు రజనీ.. జస్ట్ డబ్బులే కదా అని అంటారు. ఇలా అనేక మంది చెప్పడాన్ని విన్న నేను డబ్బుకు ఇంతకాలం విలువ ఇవ్వలేదు. అందుకే 40 యేళ్ళగా డబ్బుకు విలువ ఇవ్వలేదు. కానీ, ఇపుడు ఆ డబ్బు గురించి తెలుసుకున్నాను. దాన్ని విలువ, గౌరవం గ్రహించాను. ఎపుడైతే డబ్బు విలువ తెసుకున్నానో ఆ డబ్బు ఇపుడు నాకు కూడా విలువ, గౌరవం ఇస్తుంది' అన్నారు.

నాలుగు పదుల వయసులోనూ...


మాళవిక

'కరుప్పుదాన్ ఎనక్కు పుడిచ్చ కలరు' అనే పాటతో కోలీవుడ్ ప్రేక్షకుల్లో స్థానం సంపాదించుకున్న మాళవిక 45 యేళ్ళ వయసులోనూ గ్లామరస్‌గా కనిపిస్తూ, ఎక్స్‌పోజింగ్ చేస్తున్నారు. ఆమె తాజాగా ఈత కొలనులో స్విమ్ సూట్ ధరించి తీసిన ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిని చూసిన నెటిజన్లతో పాటు సినీ అభిమానులు ఈ వయస్సులోనూ గ్లామర్ ఏమాత్రం తగ్గలేదంటూ కామెంట్స్ చేస్తున్నారు. 2007లో ఓ పారిశ్రామికవేత్తను వివాహం చేసుకుని, ఇద్దరు పిల్లలకు తల్లయిన మాళవిక... 'తిరుట్టు పయలే' చిత్రం తర్వాత చిత్రపరిశ్రమకు దూరమయ్యారు. ఇపుడు రీ ఎంట్రీ ఇచ్చేందుకు ఆశపడుతున్నారు. సిమ్రన్, జ్యోతిక, దేవయాని వంటి వారు రీఎంట్రీ అయి సినిమాల్లో రాణిస్తున్నారు. కానీ, మాళవికకు అవకాశం ఇచ్చేందుకు దర్శక నిర్మాతలు వెనుకంజ వేస్తున్నారు. ఇదిలావుంటే, యంగ్ హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోకుండా స్విమ్ సూట్‌లో ఫొటో షూట్ చేసి వాటిని షేర్ చేశారు. ఈ ఫొటోలతో తనకు మంచి పబ్లిసిటీ వస్తాయని ఆమె గట్టిగా నమ్ముతున్నారు. పైగా, విలన్ పాత్రల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు.

నటుడు కింగ్‌కాంగ్ కుమార్తె వివాహం

● ఆశీర్వదించిన సీఎం


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న సీఎం స్టాలిన్ తదితరులు

ప్రముఖ హాస్య నటుడు కింగ్‌కాంగ్ కుమార్తె కీర్తన వివాహం నవీన్ అనే యువకుడితో జరిగింది. గురువారం రాత్రి నగరంలో జరిగిన వీరి వివాహ రిసెప్షన్ వేడుకల్లో ముఖ్యమంత్రి స్టాలిన్, పలువురు మంత్రులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే, సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, 'అదిశయ పిరవి' అనే సినిమాలో రజనీకాంత్‌తో కలిసి కింగ్‌కాంగ్ నటించారు. ఇందులో కింగ్‌కాంగ్ గురువుగా, రజనీకాంత్ శిష్యుడిగా నటించారు. ఆ తర్వాత హాస్య నటుడు వడివేలుతో కలిసి ఆయన అనేక చిత్రాల్లో నటించి మంచి గుర్తింపుపొందారు.

తరుణి

కళాకారిణిగా, శిక్షకురాలిగా..
బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీవిద్య



● గాత్ర, వాద్య సంగీతంలో మేటి ఈ వైణికురాలు
● శ్రీవిద్య వడ్లమాని సంగీత ప్రస్థానం నేటి 'తరుణి'లో..


సంగీత కచేరీలో గానం చేస్తున్న శ్రీవిద్య

"గాత్ర సంగీతం కానీ వాద్య సంగీతం కానీ నేర్చుకోవాలంటే ముఖ్యంగా ఆసక్తి ఉండాలి. ప్రారంభించాక తగిన పరిశ్రమ చేయాలి. ఓపిక, సహనం, శ్రద్ధతో సాధన చేయాలి. ఎంత సాధన చేస్తే అంతగా ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. ఏ కళ అయినా అంకిత భావంతో నేర్చుకున్నవారే తమ లక్ష్యాన్ని చేరుకోగలుగుతారు." అని తరుణితో తన అనుభవాలు పంచుకున్నారు శ్రీవిద్య.


ప్రముఖుల చేతులమీదుగా జ్ఞాపిక అందుకుంటూ..

'లక్ష్యం.. విజయం కోసం పెట్టిన శక్తిపై ఆధారపడి ఉంటుంది. ఆ శక్తి అందు నిమిత్తమై వెచ్చించబడిన సమయాన్ని బట్టి మారుతుందన్నారు ఏకనాథ్ రనడే. సంగీతమే ధ్యేయంగా, లక్ష్యంగా ఎంచుకొన్న ఎందరో సంగీతజ్ఞులు, వాగ్గేయకారులు ప్రతి క్షణాన్ని సంగీతానికే వెచ్చించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. మొక్కవోని దీక్షతో శాస్త్రీయ సంగీతంలో రాణించాలన్న ధ్యేయంతో కృషి చేస్తున్నది వర్ధమాన గాయని, వైణికురాలు శ్రీవిద్య వడ్లమాని. ఆమె సంగీత ప్రస్థానం నేటి 'తరుణి'లో..

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి


కచేరీలో తల్లితో కలిసి

శ్రీవిద్య పుట్టింది విజయవాడ. పెరిగినదంతా చెన్నైలోనే. తల్లి సుజన పారుపల్లి. ఆమె వైణికురాలు. చెన్నై ఆకాశవాణిలో ఏ-గ్రేడ్ ఆర్టిస్టు. తండ్రి సుబ్రహ్మణ్య శర్మ వడ్లమాని. ఆయన ఐఐటీలో ప్రొఫెసర్. శ్రీవిద్యకు ఒక సోదరుడు. ఆమె పాఠశాల విద్య ఐఐటీ కేంద్రీయ విద్యాలయంలో జరిగింది. యతిరాజ్ కాలేజీ ఫర్ ఉమెన్స్‌లో బి.కామ్ చదివి ప్రస్తుతం మద్రాస్ విశ్వవిద్యాలయంలో మ్యూజిక్‌లో ఎమ్.ఏ చివరి సంవత్సరం చదువుతున్నది. సంగీతంలో సర్టిఫికేట్ కోర్సు కూడా చేసింది. ప్రస్తుతం చెన్నై ఆకాశవాణిలో బి.హైగ్రేడ్ ఆర్టిస్టుగా తన ప్రతిభ చాటుతున్నది.

సంగీతం వారసత్వంగా....

సంగీతం వారసత్వంగా కలిగిన కుటుంబం నుండి వచ్చింది శ్రీవిద్య. ఆమె తాత పారుపల్లి రామకృష్ణయ్య పంతులు పేరు ప్రఖ్యాతులున్న సంగీత విద్వాంసులు. సంగీత కళానిధి, డా.మంగళంపల్లి బాలమురళీకృష్ణకి సంగీతంలో గురువు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు అంటే ఆయన సంగీతజ్ఞానం అనిర్వచనీయం.శ్రీవిద్య ముత్తాత,త్యాగరాజస్వామి శిష్యపరంపరలో ఆరో తరానికి చెందిన వారు. గొప్ప సంగీత నేపథ్యం కలిగిన కుటుంబంలో శ్రీవిద్య తల్లి కూడా గాయని, వైణికురాలు. శ్రీవిద్య మామయ్య మృదంగం విద్వాంసుడు.

సంగీతం నేర్పిస్తున్న గురువుగా....

శాస్త్రీయ సంగీతం తాను నేర్చుకుంటూనే బోధనలో కూడా ప్రవేశించింది శ్రీవిద్య. తన గురువు


ప్రముఖ సంగీత కళాకారుడితో శ్రీవిద్య

శ్రీరంజని మ్యూజిక్ స్కూల్ 'తపస్య'లో మూడు సంవత్సరాలుగా సంగీతం నేర్పిస్తోంది. ఆన్‌లైన్‌లో దేశ,విదేశీ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నది. చిన్నారులకు వీణ కూడా నేర్పించే స్థాయికి ఎదిగింది.

సంగీత ప్రదర్శనలు....

పాఠశాల విద్యనభ్యసించే సమయంలోనే ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాటలు పాడింది శ్రీవిద్య. 11 సంవత్సరాల వయసులో మొదటిసారిగా వేదికపైన సోలో కచేరీ చేసిన తర్వాత ఎన్నో ప్రదర్శనలు ఆమె ఖాతాలో చేరాయి. 'మధురధ్వని' ఆధ్వర్యంలో 2019 నుంచి సంగీత ప్రదర్శనలతో ప్రతిభ కనబరుస్తున్నది శ్రీవిద్య. 'నైవేలి శిష్యకులమ్' నిర్వహణలో 2014 నుంచి గాత్రకచేరీతో శ్రోతలను అలరిస్తున్నది. చెన్నైలోని శక్తి సంగీతసభ, రాగసుధా హాలు, సంగీతం ఫెస్టివల్ వంటి వేదికలపై తన గాత్రమాధుర్యంతో శ్రోతలకు శ్రవణానందం కలిగించింది. విజయవాడలోని సంగీత సన్మండలి, హైదరాబాదులోని సంగీత క్షీరసాగరం, విశాఖపట్టణానికి చెందిన సద్యోజాతం సంగీత సత్సంగం, ముంబయిలోని ది ఫైన్ ఆఫ్ ఆర్ట్స్, చెన్నైలోని 'నాదసుధ' ఐఐటీ మద్రాస్ యూత్ ఫెస్ట్, బ్రహ్మగాన సభ, చారుసుర్ యూత్ సరీస్, ముద్రా నవరాత్రి వైభరమ్ వంటి ఎన్నో సభలు, మరెన్నో వేదికలపై శాస్త్రీయ సంగీత కచేరీలతో శ్రోతలకు వీనులవిందు చేసింది శ్రీవిద్య.

సంగీత ప్రస్థానం....

బాల్యంనుండే అమ్మపాట, వీణవింటూ పెరిగిన శ్రీవిద్యకు సంగీతంపై ఆసక్తి బాల్యంలోనే కలిగింది. తల్లి ఆమెకు తొలి గురువు. ఏడేళ్ల వయసులోనే అమ్మ దగ్గర శాస్త్రీయ సంగీతానికి శ్రీకారం చుట్టింది. ఆరేళ్ళపాటు తల్లిదగ్గర సంగీతాభ్యాసం చేసిన శ్రీవిద్య ఆ తరువాత సంగీత కళానిధి ఆర్.సంతానగోపాలం దగ్గర 8 సంవత్సరాలు శాస్త్రీయ సంగీతంలో శిక్షణ తీసుకుని, నాలుగేళ్ళుగా ఆయన కుమార్తె శ్రీరంజని దగ్గర సంగీతంలో శిక్షణ పొందుతోంది. తల్లి వద్దే 5సంవత్సరాల నుండి వీణ కూడా నేర్చుకుంటున్నది. చిత్రలేఖనం పట్ల ఆసక్తే కాదు ప్రవేశం కూడా ఉంది. కూచిపూడి నృత్య కూడా కొన్నేళ్ళు నేర్చుకున్న అనుభవం ఉంది.

బహుమతులు, పురస్కారాలు...

2015వ సంవత్సరంలో 'గురుగుహామృతం' వారు నిర్వహించిన ముత్తుస్వామి దీక్షితార్ కృతుల పోటీలో మొదటి బహుమతి అందుకున్నది. 'రసిక రంజనిసభ' వారి ఆధ్వర్యంలో జరిగిన త్యాగరాజ కృతుల పోటీలో పలుమార్లు బహుమతులందుకున్నది ఆమె. 2020లో టైమ్స్ త్యాగరాజ అవార్డ్స్‌లో ద్వితీయ బహుమతి తీసుకుంది శ్రీవిద్య. అత్యుత్తమ గాత్ర సంగీతకారిణిగా సాయి రాక్స్ స్టూడియో నిర్వహించిన పోటీలో ఎంపికైంది. బెంగళూరులోని రామలలిత కళామందిరం వారు నిర్వహించిన రాగమ్, తానమ్, పల్లవి పోటీలో ప్రథమ బహుమతి గ్రహించింది. 2024లో సీసీఆర్‌టీ యంగ్ ఆర్టిస్ట్ స్కాలర్‌షిప్ అందుకుంది శ్రీవిద్య. ఇవే కాకుండా మరెన్నో బహుమతులు, సన్మానాలు, సత్కారాలు పొందిన ఘనత శ్రీవిద్యది.

సంగీతం, వీణలో ప్రావీణ్యం సంపాదిస్తూనే ఎంతోమంది విద్యార్థులకు శిక్షణ కూడా ఇస్తున్నదామె. విద్యార్థినిగా, ఉపాధ్యాయురాలిగా ద్విపాత్రాభినయం చేస్తున్న శ్రీవిద్య, ఒత్తిడిని అధిగమించేందుకు 'మెడిటేషన్' చేస్తుంది. తన అభిరుచులకు మెరుగులు దిద్దుకుంటోంది.


కుటుంబ సభ్యులతో

మున్నుఖిలో 'పరివర్తన'పై శిక్షణా శిబిరం


శిక్షణా శిబిరం ప్రారంభ దృశ్యం

అడయార్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విండో డ్యాన్సర్స్ ట్రస్ట్, ఒమేగా హెల్త్ కేర్ సహకారంతో ఒమేగా ఫోరం ఫర్ సోషల్ ఇంపాక్ట్ (ఏఎఫ్ఎస్ఐ) 'షీ మ్యాటర్స్ 2.0' పేరుతో మూడు రోజుల శిక్షణా శిబిరం శుక్రవారం ప్రారంభమైంది. మున్నుకి గ్రామంలో ప్రారంభమైన ఈ శిబిరంలో పలు అంశాలపై చర్చించారు. ఇందులో కథ చెప్పడం, థియేటర్, నృత్యం, ఇతర సృజనాత్మక వ్యక్తీకరణ సాంప్రదాయ కళల స్వీయ ఆవిష్కరణకు శక్తివంతమైన సాధనాలుగా ఉపయోగిస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. లింగ ఆధారిత హింస, స్టీరియోటైప్, పునరుత్పత్తి ఆరోగ్యం, ఆదాయం, ఖర్చుల నిర్వహణ సహా ప్రాథమిక ఆర్థిక, అక్షరాస్యతపై సంభాషణలను ప్రారంభించడానికి, వర్క్‌షాప్‌లను సులభతరం చేయడానికి సన్నద్ధమైన నాయకులుగా శిక్షణ ఇవ్వాలని వారు కోరారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల, జూలై11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ సహా పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, గుజరాత్ చీఫ్ సెక్రటరీ పంకజ్ కుమార్, తెలంగాణ జాయింట్ సెక్రటరీ కె శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ వీరిలో ఉన్నారు.

యనమల రామకృష్ణుడు


రుయాస్పత్రికి కందారపు రాజమ్మ కళ్లు దానం

తిరుపతి(వైద్యం), జూలై 11(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి తల్లి కందారపు రాజమ్మ(82) అనారోగ్యంతో స్విమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. ఆమె కళ్లను రుయాస్పత్రి కంటి నిధికి దానం చేసేందుకు మురళి ముందుకొచ్చారు. ఈ విషయాన్ని ఆస్పత్రి కంటి విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి దృష్టికి తీసెకెళ్లడంతో టెక్నీషియన్ రమేష్.. మృతురాలి కళ్లను సేకరించి కంటి నిధిలో భద్రపరిచారు. కంటి చూపులేని వారికి తన తల్లి కళ్లతో లోకంచూసే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చినట్లు మురళి తెలిపారు. రాజమ్మ కుటుంబీకులను రుయా సూపరింటెండెంట్ రాధ, వైద్యాధికారులు అభినందించారు.



తన తల్లి కళ్లను రుయాస్పత్రి కంటి నిధికి దానం చేస్తున్న కందారపు మురళి

సర్వ దర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.54 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,473

తలనీలాలు సమర్పించినవారు: 27,796

విద్యా సంస్థల ప్రాంగణాల్లో

'పొగాకు' విక్రయాలపై కొరడా

● విస్తృతంగా పోలీసుల తనిఖీలు ● ఇప్పటికి 56 కేసులు నమోదు



పొగాకు ఉత్పత్తులు తీసుకోబోమంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసు అధికారులు



దుకాణాల వద్ద తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యాసంస్థల ప్రాంగణాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఇప్పటికి 56 కేసులు నమోదు చేశారు. విద్యాసంస్థలకు 200 మీటర్ల లోపు పొగాకు విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు చేసి ఒక్కో దుకాణాదారుడికి రూ.200 అపరాధ రుసుం విధించారు. మళ్లీ విక్రయాలు జరిపితే నేరుగా కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. ఇకపై అన్ని మాల్స్, షాపులు, దుకాణాలు, ఇతర వాణిజ్య, వర్తక దుకాణాల్లోనూ ముమ్మరంగా తనిఖీలు చేసి పొగాకు ఉత్పత్తులు విక్రయాలు చేస్తున్న వారిపై మరిన్ని కేసులు నమోదు చేస్తామని తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం హెచ్చరించారు. దీనికి సంబంధించి ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోని దుకాణాలను తనిఖీ చేసి ప్రతి రోజు నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎస్వీఎస్ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్'పై అవగాహన తరగతులు నిర్వహించారు. అంతకుముందు గోవిందరాజస్వామి ఆలయ ప్రాంగణంలో అన్ని దుకాణాలు తనిఖీ చేసి పొగాకు ఉత్పత్తులు విక్రయించే వాటికి అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీతో పాటు సీఐలు శ్రీనివాసులు, మురళీమోహన్, పోలీసులు పాల్గొన్నారు.

70 విద్యా సంస్థల్లో ఈగల్ టీమ్‌లు ఏర్పాటు

వారం రోజులుగా 70 విద్యాసంస్థల్లో ఈగల్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. మిగతా వాటిలోనూ ఏర్పాటు చేసే దిశగా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎనిమిది.. ఆపై తరగతులకు సంబంధించిన అన్ని విద్యాసంస్థల్లో ఈగల్ టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ భక్తవత్సలం చెప్పారు. ఈ టీమ్‌లో ప్రధానోపాధ్యాయుడు, కళాశాల ప్రిన్సిపల్ నామినేట్ చేసిన ఇద్దరు సీనియర్ అధ్యాపకులు కో ఆర్డినేటర్లుగా ఉంటారు. వారిలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వారికి ప్రాధాన్యమిస్తారు. ఇద్దరు విద్యార్థులు, మరో ఇద్దరు విద్యార్థినులు ఉంటారు. వీరు ఆయా విద్యాసంస్థల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు, వినియోగం, మత్తు పదార్థాలు, గంజాయి వినియోగం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇస్తారు. అంతే కాకుండా ప్రతి తరగతిలో విద్యార్థులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటారు.



టమోటా లోడుతో బోల్తా పడిన వాహనం (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన మహబూబ్ బాషా

భాకరాపేట ఘాట్‌లో

రోడ్డు ప్రమాదం

● ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న మినీ లారీ ● ఒకరి దుర్మరణం.. ఇద్దరికి తీవ్రగాయాలు

చంద్రగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): టమోటా లోడ్‌తో వేగంగా వస్తున్న మినీ లారీ అదుపు తప్పి మోటారు సైకిల్‌ను ఢీకొని బోల్తాపడిన ఘటనలో ఒకరు దుర్మరణం చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చంద్రగిరి మండలం కళ్యాణి డ్యామ్ సమీపంలోని భాకరాపేట ఘాట్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. భాకరాపేట సమీపంలోని దీన్‌ధార్‌పల్లెకు మహబూబ్ బాషా(58).. చంద్రగిరి మండలం కాశిపెంట్ల వద్ద హెరిటేజ్ ఫ్యాక్టరీలో వర్క్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన తన విధులు ముగించుకుని, స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కళ్యాణి డ్యామ్ సమీపానికి వచ్చే సరికి.. మదనపల్లె నుంచి టమోటా లోడ్తుతో అతివేగంగా వస్తున్న మినీలారీ ఈ ద్విచక్ర వాహనంపై దూసుకెళ్లి, రోడ్డు పక్కన కల్వర్టులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మహబూబ్‌బాషా అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్లు గుడివాకు చెందిన ధర్మయ్య, హుస్సేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చంద్రగిరి పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్లు ధర్మయ్య, హుస్సేన్

విధుల్లో నిర్లక్ష్యం వహించిన

ట్రాన్స్‌కో ఏఈ సరెండర్

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల ట్రాన్స్‌కో ఏఈగా పనిచేస్తున్న చలపతి విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో ఎస్ఈ కార్యాలయంలో సరెండర్ చేసినట్లు శ్రీకాళహస్తి ఏడీఈ సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏఈ చలపతి 33కేవీ ఫీడర్‌లో మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహించి వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ ఇవ్వలేదని తెలిపారు. వినియోగదారుల సమస్యలపై స్పందించకపోవడం, విద్యుత్ సరఫరాలో పలుమార్లు అంతరాయం చోటు చేసుకున్నా పట్టించుకోకపోవడంతో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అధికం కావడంతో ఎస్ఈ సురేంద్ర నాయుడి ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి మండల ఏఈగా విధుల నుంచి తప్పించి ఎస్ఈ కార్యాలయంలో రిపోర్టు చేయవలసిందిగా ఆదేశాలు వచ్చినట్లు ఏడీఈ తెలిపారు.

అంగన్వాడీ పుస్తకాల ఆవిష్కరణ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీల్లో ఆటపాటలతో పాటు పుస్తకాల ద్వారా విజ్ఞానం పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ 3నుంచి 6 వ సంవత్సరం వరకు పిల్లలకు అందజేసే పుస్తకాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఐసీడీఎస్ పీడీ వసంతాబాయి, అసిస్టెంట్ పీడీ వాసంతి తదితరులు పాల్గొన్నారు.





రూ.3 కోట్లతో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సీఐసీ కేంద్రం

ఐఐటీలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్

● రోజుకు 20 టన్నులు ప్రాసెస్ చేసేలా యంత్రాల ఏర్పాటు

● రేపు రాష్ట్రమంత్రి భరత్‌తో కలిసి ప్రారంభించనున్న కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్

ఏర్పేడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్‌కు సంబంధించి ఏర్పాటైన కామన్ ఇంక్యుబేషన్ సెంటర్(సీఐసీ) ప్రారంభానికి సిద్ధంగా ఉంది. రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌తో కలిసి కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఆదివారం ఈ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. భారత ప్రభుత్వం ఈ కేంద్రాన్ని రూ.3కోట్లతో ఫుడ్‌ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ, ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద అభివృద్ధి చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న 76 కేంద్రాల్లో తిరుపతిలో ఏర్పాటు అవుతున్న ఈ కేంద్రం ఒకటి. రూ.2,059 కోట్ల వ్యయంతో ఈకేంద్రాలను నిర్మిస్తున్నారు. ఈ కేంద్రాన్ని తిరుపతి ఐఐటీ రసాయనిక ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కేఎస్ఎం రాఘవరావు సమన్వయంతో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మార్గదర్శనంలో అభివృద్ధి చేశారు. ఈ కేంద్రం ముఖ్యంగా పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ మీద దృష్టి సారించనుంది. ఒక రోజుకు 20 టన్నుల వరకు మామిడి, అంజీర్, జామ తదితర పండ్లను ప్రాసెస్ చేసి జ్యూస్, పల్ప్, జామ్, పికిల్స్ వంటివి తయారు చేస్తారు. ఈ కేంద్రం విద్యార్థులకు పరిశోధన కేంద్రంగా కూడా ఉపయోగపడుతుంది. ఎంఎస్, పీహెచ్‌డీ విద్యార్థులకు ఫుడ్ టెక్నాలజీలో ప్రాక్టికల్ శిక్షణ పొందడానికి మెరుగైన అవకాశం ఉంటుంది. ఈ సెంటర్‌లో తయారయ్యే ఉత్పత్తులు స్వస్థ అనే బ్రాండ్ ద్వారా మార్కెట్‌లోకి రానున్నాయి.



సీఐసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన యంత్రాలు



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రౌడీయిజంతో కుటుంబాలు ఛిద్రం: డీఎస్పీ

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): అనాలోచితంగా అత్యుత్సాహంతో రౌడీయిజానికి పాల్పడితే వారి కుటుంబాలన్నీ తీవ్రంగా నష్టపోతాయని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. ఇటీవల ప్రభుత్వాస్పత్రిలో రెండు వర్గాలు దాడులకు దిగిన ఘటన తెలిసిందే. దీనిపై రౌడీయిజాన్ని రూపుమాపాలన్న ధ్యేయంతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సబ్‌డివిజన్ పోలీసు యంత్రాంగం అంతా పట్టణంలో గురువారం రాత్రి కవాతు నిర్వహించి దాడి ఘటనలో పాత్రధారులైన వారి ఇళ్ల వద్దకు చేరుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాళహస్తిలో సరికొత్త ఆలోచనతో రౌడీయిజాన్ని తగ్గించాలని నిర్వహించిన పోలీసు కవాతుకు అన్ని వర్గాల ప్రజల నుంచి హర్షం వ్యక్తమైంది. ముందుగా డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది సమావేశమయ్యారు. పట్టణ ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహిస్తూ 1వ వార్డు వరకు చేరుకున్నారు. ఇటీవల దాడిలో పాల్గొన్న వారి ఇళ్ల వద్దకువెళ్లి మైకుల ద్వారా రౌడీయిజానికి పాల్పడితే ఆయా కుటుంబంలో పిల్లలు, మహిళలకు సమాజంలో గౌరవం లోపిస్తుందని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల నియామకానికి కూడా అవకాశం కోల్పోతారని తెలిపారు. రౌడీషీటర్‌గా నమోదైతే జరిగే నష్టాలను తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు సహకరించడం, మత్తు వ్యసనాలకు గురైతే ఎదురయ్యే అనర్థాలను వివరించారు. అక్కడి నుంచి పట్టణంలోని పలుప్రధాన వీధుల్లో కవాతుగా సాగుతూ మంచినీళ్ల గుంట ప్రాంతానికి చేరుకున్నారు. ఇక్కడ దాడి ఘటనలో ఉన్న వారి కుటుంబాలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐలు గోపి, తిమ్మయ్య, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

10 మంది హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి

తిరుపతి(నేరవిభాగం),జూలై 11(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న 10 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ఎస్పీ హర్షవర్ధనరాజు ఉత్తర్వులు జారీ చేశారు. వీరందరికీ శుక్రవారం పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇందులో సత్యనారాయణ సీఐడీ నుంచి ఇంకా రిలీవ్ కాలేదు. అలాగే సి.మురళిని తిరుమల టూ టౌన్ నుంచి తిరుపతి వెస్ట్‌కు, షేక్ జిలానీ ఫీర్‌ను రేణిగుంటకు, టి.గోపాల్‌ను అలిపిరి పీఎస్‌కు, ఎన్. శ్రీనివాసులును తిరుచానూరు నుంచి ఆర్‌సీ పురానికి, ఎన్. వెంకటేశ్వర రావును క్రైం స్టేషన్ నుంచి ఎంఆర్‌పల్లెకి, ఈశ్వర సింగ్‌ను శ్రీకాళహస్తి టూ టౌన్ నుంచి ఏర్పేడుకు, టి.సుబ్రమ్మణ్యం రెడ్డికి ఇంటెలిజెన్సు నుంచి రిలీవ్ అయి వచ్చిన తర్వాత పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఇక టి. పురుషోత్తమ ఆచ్చారిని క్రైం స్టేషన్ నుంచి చంద్రగిరికి, రాజగోపాల్ రెడ్డిని క్రైం స్టేషన్‌లో కోర్టు మానటరింగ్ విభాగం నుంచి రేణిగుంట విమానాశ్రయానికి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మఠం, కాలువ భూముల్లో నిర్మాణాలు

● అడ్డుకున్న అధికారులు ● ఆక్రమించి నిర్మిస్తే క్రిమినల్ కేసులు పెడతామన్న కలెక్టర్



మఠంభూమిలో నిర్మాణాల తొలగింపు తర్వాత అధికారులతో మాట్లాడుతున్న నిర్మాణదారులు



నిర్మాణదారులతో మాట్లడుతున్న ఎండోమెంట్ ఈవో బాపిరెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, డీఎస్పీ ప్రసాద్

తిరుపతిరూరల్, జూలై11(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం అవిలాల పంచాయతీ సర్వేనంబర్లు 145, 147లోని వివాదాస్పద మఠం భూముల్లో చేపడుతున్న నిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు అడ్డుకున్నారు. న్యాయస్థానంలో కేసు నడుస్తున్న (స్టేటస్ కో) ఈ భూముల్లో పరకాల మఠం ద్వారా పొందిన నరసింహారెడ్డి, అతడి మనుషులు నిర్మాణాలు చేపడుతున్నారన్న సమాచారంతో ఇటీవల హథీరాంజీమఠం అధికారులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలతో శుక్రవారం ఆర్డీవో రామ్మోహన్, ఎండోమెంట్ ఈవో బాపిరెడ్డి, డీఎస్పీ ప్రసాద్, రూరల్ తహసీల్దార్ రామాంజులనాయక్, రూరల్‌సీఐ చిన్నగోవిందు ఈ భూములను పరిశీలించారు. నిర్మాణాల తొలగింపునకు అధికారులు ప్రయత్నించగా నిర్మాణదారులు అడ్డుకున్నారు. 'సర్వేనంబరు 145, 147లో హథీరాంజీమఠం, పరకాల మఠానికి సంబంధించి వివాదం నడుస్తోంది. దీనిపై హైకోర్టు స్టేటస్ కో విధించింది. ఇందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు' అంటూ నరసింహారెడ్డి, అతని తరపు వ్యక్తులను పిలిపించి మాట్లాడారు. కోర్టు ఉత్తర్వులు ధిక్కరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మఠంభూమికి సమీపంలోని అవిలాల గ్రామానికి సంబంధించి సర్వేనంబరు 146లో వాగుపోరంబోకు స్థలంలో చేపడుతున్న నిర్మాణాలను రూరల్ తహసీల్దార్ రామాంజులనాయక్ అడ్డుకున్నారు. ఇది కాలువభూమి కాదని, సర్వేనంబరు 147కి సంబంధించిన మఠంభూమి అని సేతుమాధవ్, మరికొందరు అడ్డుకున్నారు. ఈ భూమిని సర్వేచేశామని, సర్వేనంబరు 146కి సంబంధించి కాలువభూమిగా నిర్ధారణ అయిందని తహసీల్దార్ వివరించారు. దీనిపై ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని, ఎంతకూ స్పందించకపోవడంతో తొలగింపు చర్యలు చేపట్టామన్నారు. సర్వేకోసం రెండువారాల గడువు కావాలని సేతుమాధవ్ కోరగా, వారం రోజుల్లో సర్వే ప్రక్రియని పూర్తిచేయాలని తహసీల్దార్ సూచించారు. కాగా సర్వేసమయంలో ప్రైవేట్ సర్వేయర్‌తోపాటు డిస్ట్రిక్ట్ సర్వేయర్‌ని కూడా పంపుతామని, కాలువభూమిగా నిర్ధారణ అయిన వెంటనే నిర్మాణాలు తొలగిస్తామని సూచించారు. ఎండోమెంట్‌భూములు, కాలువపోరంబోకు భూముల ఆక్రమణలపై ఆయా విభాగ అధికారులు స్పందించారు. ఈవివాదంపై కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించారు. మఠంభూమి, ప్రభుత్వభూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హైకోర్టు స్టే విధించినా మఠంభూములను ఆక్రమించడం, నిర్మాణాలు చేపట్టడం వంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆక్రమణల తొలగింపును అడ్డుకున్న ఆరుగురిపై క్రిమినల్ కేసులు

తిరుపతి (నేరవిభాగం), జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు, తొలగింపు సందర్భంగా రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించడం, బెదిరింపులకు పాల్పడిన ఘటనలో ఆరుగురిపై క్రిమినల్ కేసు నమోదైంది. తిరుపతి రూరల్ తహసీల్దారు బి.రామాంజులునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎంఆర్‌పల్లె పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అవిలాలలోని, లింగేశ్వరనగర్‌లో సర్వేనెంబరు 146లో శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో రెవెన్యూ, పోలీస్ బలగాలు కలసి అక్రమ ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా దండు కామేశ్వరి, ఎస్.యశోద, సి.బాలాజీ, పి.సేతుమాధవ్, పి.మోహన్, ఐ.సాయిచరణ్ అధికారులను అడ్డుకున్నారు, దురుసుగా ప్రవర్తించారు, బెదిరింపులకు పాల్పడ్డారు. రెవెన్యూ శాఖ ఉపయోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను బలవంతంగా నిలిపి వేయించారు. ప్రభుత్వ భూమిపై తమ అధికారం చూపుతూ, రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించడంతో తహసీల్దారు ఎంఆర్‌పల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పలు సెక్షన్ల కింద ఈ ఆరుగురిపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు.